## క్లుప్తంగా

### కేసీఆర్ బహిరంగ సభను జయప్రదం చేయాలి

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పట్టణంలో ఈ నెల 20న నిర్వహించే సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద బహిరంగ సభను జయప్రదం చేయాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున ముదిరాజ్ కోరారు. శనివారం నల్లగొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన వెంట నోముల క్రాంతికుమార్, సిరిగిరి సురేష్‌రెడ్డి, సుందర్‌నాయక్, గంట కిరణ్, దినేష్, గణేశ్ తదితరులు ఉన్నారు.

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ : విద్యుత్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మలు కొట్టే పనులు చేపడుతున్నందున ఆదివారం నల్లగొండ పట్టణంలోని పలు కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ శంకరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. బీట్ మార్కెట్, శివాజీనగర్, ఎన్జీ పార్కు, సావర్కర్ నగర్, గాంధీనగర్, వైకుంఠపురం, శివరాంనగర్, హనుమాన్‌నగర్, వాణిగ్రామర్ స్కూల్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

### గో సంరక్షణ కోసమే ఎన్నికల్లో పోటీ

మునుగోడు: రోజురోజుకూ తరిగిపోతున్న గోవులను రక్షించేందుకే యుగ తులసి పార్టీ పెట్టి మునుగోడు ఎన్నికల బరిలో నిలిచానని యుగ తులసి పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కొలిశెట్టి శివకుమార్ అన్నారు. శనివారం 7 ప్రచార రథాలను మునుగోడులో జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. ఉప్పనూతల ఉపేందర్, సంగమేశ్వరచారి, ప్రవీణ్ కుమార్, గుర్జ సుధాకర్, ఎండీ మహీబూబ్ పాల్గొన్నారు.

### సీపీఎం అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం

నల్లగొండ టౌన్ : నల్లగొండ నియోజకవర్గ సీపీఎం అభ్యర్థి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి సత్తి కొడవలి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరుతూ సీపీఎం నాయకులు శనివారం నల్లగొండ పట్టణంలోని విలీన గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఊటుక్కూరి నారాయణరెడ్డి, తుమ్మల పద్మ, దండెంపల్లి సత్తయ్య, ఎండీ సలీం, సరోజ, భూతం అరుణ, కాసర్ల గౌతంరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సైదాచారి చంద్రయ్య, కార్తీక్ పాల్గొన్నారు.

### నకిరేకల్‌కు చేరిన రెండవ బ్యాలెట్ యూనిట్లు

నకిరేకల్ : అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి రెండవ ఈవీఎం యూనిట్ మిషన్లు శనివారం నకిరేకల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చేరాయి. నకిరేకల్ నియోజకవర్గ ఎన్నికల బరిలో 23 మంది ఉండడంతో రెండవ బ్యా లె ట్ యూనిట్ అవసరం ఏర్పడింది. 382 ఈ వీ ఎం యూనిట్లను స్థానిక ప్రభుత్వ జూని య ర్ కళాశాలలో ప్రజాప్రతినిధుల సమక్షంలో అ ధి కారులు భద్రపరిచి సీల్ చేశారు. ఆర్ఓ పాటిల్ హేమంత్ కేశవ్, సహాయ అధికారి ప్రసాద్ నాయక్ పాల్గొన్నారు.

### ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

నల్లగొండ టౌన్: జిల్లాలోని ప్రభుత్వరంగ సంస్థల్లో ఎగుమతి, దిగుమతి పనులు నిర్వహిస్తున్న హమాలీ కార్మికులను ప్రభుత్వం నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సలీం, హమాలీ కార్మికుల ఫెడరేష్, జిల్లా కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య డిమాండ్ చేశారు. నల్లగొండలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు.

### వేలం పాటలు మళ్లీ వాయిదా

కనగల్: మండల పరిధిలోని దర్వేశిపురం శ్రీ రేణుకాఎల్లమ్మ దేవస్థానం వద్ద శనివారం జరగాల్సిన బహిరంగ వేలం పాటలు మరోసారి వాయిదా పడినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి జిల్లేపల్లి జయరామయ్య, చైర్మన్ అల్గుబెల్లి నర్సింహారెడ్డి తెలిపారు. ఆలయం వద్ద శనివారం వేలం పాటలు నిర్వహించేందుకు సమావేశం ఏర్పాటు చేశారు. దీనికి కేవలం అధికారులు, ఆలయ కమిటీ సభ్యులే హాజరయ్యారు. డిపాజిట్‌దారులు ఎవరూ రాకపోవడంతో వేలం పాటలను వాయిదా వేసినట్లు పేర్కొన్నారు.

### వైన్స్ షాపులో పనిచేసే వ్యక్తి మృతి

రామగిరి(నల్లగొండ): వైన్స్ షాపులో పనిచేస్తున్న వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం తిప్పర్తి మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్‌కు చెందిన ప్రతిగంటం గాంగేయవర్మ(41) అధ్యాపకుడి పని చేసేవాడు. 8 సంవత్సరాలుగా మద్యానికి బానిసై ఉద్యోగం వదలేశాడు. ఆరోగ్యం పాడైపోవడంతో మద్యం తాగొద్దని కుటుంబ సభ్యులు చెప్పడంతో ఇంట్లో నుంచి వెళ్లి వైన్స్‌షాపులలో పని చేస్తున్నాడు. భార్య లక్ష్మీభవానీ తల్లి వద్ద హైదరాబాద్‌లో ఉంటూ ఫార్మా కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. గాంగేయవర్మ పది రోజుల క్రితం అనిశెట్టి దుప్పలపల్లి వద్ద గల ఓ వైన్స్‌షాపు సిట్టింగ్‌లో వెయిటర్‌గా పనిలో చేరాడు. పని పూర్తయ్యాక అక్కడే ఉంటున్నాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం వైన్స్ షాపు తీసే సమయానికి చనిపోయి ఉన్నాడు. దీంతో గాంగేయవర్మ కుటుంబ సభ్యులకు, పోలీసులకు షాపు యజమాని సమాచారం ఇచ్చారు. భార్య లక్ష్మీ భవానీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ లింగయ్య తెలిపారు.

# నకిరేకల్‌లో పెరిగిన ఓటర్ల సంఖ్య

- మొత్తం 2,50,547 మంది ఓటర్లు
- కొత్తగా 6,080 మందికి అవకాశం
- 305 పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు



ఓటు వేయడానికి బారులుదీరిన ఓటర్లు(ఫైల్)

నకిరేకల్ : నకిరేకల్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఈసారి ఓటర్లు భారీగా పెరిగారు. కొత్తగా 6,080 మంది ఓటర్లు నమోదయ్యారు. నియోజకవర్గ పరిధిలో నకిరేకల్, కేతేపల్లి, కట్టంగూరు, నార్కట్‌పల్లి, చిట్యాల, రామన్నపేట మండలాలు ఉన్నాయి. మొత్తం నియోజకవర్గ వ్యాప్తంగా ఆరు మండలాల్లో గత నెల 4న ప్రకటించిన తుది జాబితా ప్రకారం 2,44,467 మంది ఓటర్లు ఉన్నారు. అక్టోబర్ 31 వరకు కొత్తగా ఓటు కోసం అవకాశం కల్పించారు. ఈ నెల 10 వరకు కొత్తగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి 6,080 మందికి ఓటు హక్కు కల్పించారు. దీంతో మొత్తం ఓటర్ల సంఖ్య 2,50,547 కి చేరింది. వీరిలో పురుషులు 1,24,668 మహిళలు 1,25,876 మంది, ట్రాన్స్‌జెండర్లు ముగ్గురు ఉన్నారు. 2018లో శాసన సభ ఎన్నికల్లో నియోజకవర్గ వ్యాప్తంగా 89 శాతం పోలింగ్ నమోదయింది. ఈసారి గతంలో కంటే ఎక్కువ పోలింగ్ శాతం నమోదుకోసం ఓటర్ చైతన్య కార్యక్రమాలను అధికారులు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలో 305 పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించేందుకు 680 మంది పీఓలు, 680 మంది ఏపీఓలు, 680 మంది ఓపీఓలకు రెండు విడతలు శిక్షణ ఇచ్చారు. 23 నుంచి మూడో విడత శిక్షణ కొనసాగనుంది. నకిరేకల్‌లో 61, రామన్నపేటలో 59, చిట్యాలలో 52, కట్టంగూరులో 40, కేతేపల్లి లో 35, నార్కట్‌పల్లిలో 61 పోలింగ్ స్టేషన్లు మొత్తం 305పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు.

**నకిరేకల్ నియోజకవర్గ ఓటర్ల వివరాలు**

| మండలం | పురుషులు | మహిళలు | థర్డ్‌జెండర్ | మొత్తం |
|---|---|---|---|---|
| నకిరేకల్ | 24,544 | 25,266 | 02 | 49,812 |
| చిట్యాల | 23,358 | 23,473 | 00 | 46,831 |
| రామన్నపేట | 22,342 | 21,841 | 00 | 44183 |
| నార్కట్‌పల్లి | 21,101 | 21,507 | 01 | 42,609 |
| కట్టంగూరు | 18,361 | 18,281 | 00 | 36,642 |
| కేతేపల్లి | 14,962 | 15,508 | 00 | 30,470 |
| మొత్తం | 1,24,668 | 1,25,876 | 03 | 2,50,547 |

### ఓటరు చైతన్య కార్యక్రమాలు నిర్వహించాం



నకిరేకల్‌లో శాసన ఎన్నికల ఎన్నికల నిర్వహణ పకడ్బందీగా నిర్వహిస్తాం. గతంలో కంటే పోలింగ్ శాతం పెరగడం కోసం ఓటరు చైతన్య కార్యక్రమాలు నిర్వహించాం. ప్రతి ఓటరు స్వేచ్ఛగా తన ఓటు హక్కు వినియోగించుకునేలా తగిన ఏర్పాట్లు చేస్తున్నాం.ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై సీ-విజిల్ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేశాం. ఇప్పటివరకు 44 ఫిర్యాదులు అందాయి. నిబంధనల ప్రకారం వాటిని వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నాం.

– పాటిల్ హేమంత్ కేశవ్, రిటర్నింగ్ అధికారి, నకిరేకల్

# కమ్యూనిస్టులతో పొత్తు ఉంటే విజయమే



మాట్లాడుతున్న ఐజేయూ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో పల్లా వెంకట్ రెడ్డి, వీరేశం

నార్కట్‌పల్లి : కమ్యూనిస్టులతో పొత్తు పెట్టుకుని ఎన్నికల్లోకి వెళ్లిన ఏ పార్టీ అయినా విజయం సాధించిందని సీపీఐ రాష్ట్ర నేత, మునుగోడు మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. నకిరేకల్ నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి లోడంగి శ్రవణ్‌కుమార్ అధ్యక్షతన శనివారం నార్కట్‌పల్లిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మునుగోడు ఉప ఎన్నికల్లో ఈ విషయం బహిర్గతమైందన్నారు. బీఆర్ఎస్ పార్టీకి ప్రజా బలం పూర్తిగా తగ్గిందని, దీంతో ధన బలంతో ఎన్నికల్లోకి వస్తున్నారని అన్నారు. ఐజేయూ నాయకుడు కె. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ పాలనలో నిత్యావసర సరుకులు, డీజిల్, పెట్రోలు, గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగాయని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రెండు ఒక్కటేనని అన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు ఇచ్చినందున కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం సీపీఐ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. ఈ సమావేశంలో నకిరేకల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వేముల వీరేశం, సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, భువనగిరి జిల్లా సీపీఐ సహాయ కార్యదర్శి దామోదర్‌రెడ్డి, మండల కార్యదర్శి పెండ్యాల శంకరయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, సీపీఐ, వ్యవసాయ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### 'బీఆర్ఎస్‌కు చెంపపెట్టులా కాంగ్రెస్ మేనిఫెస్టో'

నకిరేకల్ : కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో బీఆర్ఎస్ పార్టీకి చెంపపెట్టులా ఉందని నకిరేకల్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి వేముల వీరేశం, మేనిఫెస్టో మెంబర్ చామల శ్రీనివాస్ అన్నారు. నకిరేకల్‌లో శనివారం కాంగ్రెస్ మేనిఫెస్టో కరదీపకలను వారు విడుదల చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దైద రవీందర్, పూజర్ల శంభయ్య, నకిరేకంటి ఏసుపాదం, కోట పుల్లయ్య, జటంగి వెంకటనర్సు, గాజుల సుకన్య, మాద యాదగిరి, కొండ వెంకన్న గౌడ్, యాసా కరుణాకర్‌రెడ్డి, లింగాల వెంకన్న, గాదగోని కొండయ్య, నరేందర్, బండపల్లి శ్రీనివాస్‌గౌడ్, నాగులంచ వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## పేదల పాలన రావాలంటే కాంగ్రెస్‌ను గెలిపించాలి

- నల్లగొండ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ): రాష్ట్రంలో దొరల పాలన పోయి.. పేదల పాలన రావాలంటే కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని నల్లగొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం తిప్పర్తి మండలంలోని పజ్జూరు, ఎర్రగడ్డలగూడెం, లక్ష్మీపురం, సోమోరిగూడెం, వెంకటాద్రిపాలెం, గడ్డి కొండారం, జంగారెడ్డిగూడెం, మల్లేపల్లివారిగూడెం, ఇండ్లూరు, మామిడాల, యాపలగూడెం, గోదోరిగూడెం, ఆరెగూడెం, ఎల్లమ్మగూడెం గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. జెడ్పీటీసీ పాశం రాంరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జూకూరి రమేష్, బద్దం సుధీర్, రాగి మురళి, ముత్తినేని శ్యామ్, జాకటి మోష, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

**కోమటిరెడ్డికి విద్యార్థి సంఘాల మద్దతు**

రామగిరి(నల్లగొండ): నల్లగొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థి సంఘం నాయకులు సంపూర్ణ మద్దతు తెలుపుతూ శనివారం తిప్పర్తి మండల కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు ఏర్పుల శ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు అణచివేతకు గురయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో పోలగోని సందీప్, లక్ష్మణ్, శ్రీను, బాలు, చింటూ, ఉస్మాన్, మధు తదితరులు పాల్గొన్నారు.

**కోమటిరెడ్డి సతీమణి సబిత ప్రచారం**

నల్లగొండ: కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆయన సతీమణి సబిత శనివారం నల్లగొండ పట్టణంలోని 5వ వార్డు శ్రీనివాస నగర్, గరుడాద్రి కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డుపల్లి లక్ష్మి, కౌన్సిలర్లు బుర్రి చైతన్య శ్రీనివాస్‌రెడ్డి, ఎగ్గడి సుజాత, కేసాని కవిత, బొడ్డుపల్లి జానకి, లలిత, సునీత, కాంగ్రెస్ పార్టీ వార్డు ఇన్‌చార్జ్ నల్లగొండ అశోక్, అవుట రవీందర్, పున్న పవన్‌కుమార్, ఇబ్రహీం, కంచర్ల ఆనంద్ రెడ్డి, జీవన్, సుక్కం సత్యనారాయణ, భగత్, రాము, జానయ్య, పున్న కిరణ్‌కుమార్, వెంకన్న, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల కోసం పదవి త్యాగం చేశా

- మునుగోడు నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

మర్రిగూడ : మునుగోడు నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించకపోవడంతో ప్రజల కోసం 18 నెలల ముందే ఎమ్మెల్యే పదవి త్యాగం చేసి పోరాటం చేశానని కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని లెంకలపల్లి, కమ్మగూడ, దామెరబీమనపల్లి, వట్టిపల్లి, రాంరెడ్డిపల్లి, సరంపేట గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. జనగామలో మూడెకరాల్లో రూ.15కోట్ల వ్యయంతో వృద్ధాశ్రమం నిర్మిస్తున్నానని, ప్రతి మండలంలో తన తల్లి సుశీలమ్మ పేరు మీద వృద్ధాశ్రమాలు నిర్మిస్తామని అన్నారు. అనంతరం పలు గ్రామాల కార్యకర్తలతోపాటు చర్లగూడెం ముంపు గ్రామస్తులు ఆయన సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఏఐసీసీ పరిశీలకులు రాజశేఖర్, టీపీసీసీ జనరల్ సెక్రటరీ పున్నా కైలాష్‌నేత, సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, నారబోయిన రవి తదితరులు పాల్గొన్నారు.

**కోమటిరెడ్డి లక్ష్మి ప్రచారం**

నాంపల్లి : మునుగోడు నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ రాజగోపాల్‌రెడ్డి సతీమణి కోమటిరెడ్డి లక్ష్మి శనివారం నాంపల్లి మండలంలోని గానుగుపల్లి, మహ్మదాపురం, గట్లమల్లేపల్లి, తుమ్మలపల్లి, రెవల్లి, మేళ్ళవాయి, కేతపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎలుగోటి వెంకటేశ్వర్‌రెడ్డి, ఎరెడ్ల రఘుపతిరెడ్డి, పూల వెంకటయ్య, పానగంటి వెంకన్నగౌడ్ తదితరులు ఉన్నారు.

**బీఆర్ఎస్ ఎంపీటీసీ కాంగ్రెస్‌లో చేరిక**

మునుగోడు: మండలంలోని చొల్లేడు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ ఎంపీటీసీ వనం నిర్మల యాదయ్య బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి శనివారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నారబోయిన రవిముదిరాజ్ ఆధ్వర్యంలో మునుగోడు కాంగ్రెస్ అభ్యర్థి రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయనతోపాటు మండలంలోని కోతులారం మాజీ సర్పంచ్ జాజుల వెంకటేష్, పీఏసీఎస్ డైరెక్టర్ వట్టికోటి వెంకటేష్, వార్డు సభ్యులు, పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు.

# భూపాల్‌రెడ్డికి ఎమ్మార్పీఎస్ టీఎస్ మద్దతు

నల్లగొండ టూటౌన్ : బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల భూపాల్‌రెడ్డికి ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు ఇస్తోందని ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షుడు మారపాక నరేందర్‌మాదిగ తెలిపారు. శనివారం నల్లగొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగల అభివృద్ధి కేసీఆర్‌తోనే సాధ్యమని, ప్రజలకు అందుబాటులో ఉండి నల్లగొండను అభివృద్ధి చేసిన కంచర్ల భూపాల్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తామని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఏడుకొండలు, పుల్లెంల యాదయ్యమాదిగ, బరిగల యాదయ్యమాదిగ, పెరిక వెంకటేశ్వర్లు, లింగయ్యమాదిగ, రమేష్‌మాదిగ, జానయ్యమాదిగ, పిచ్చయ్యమాదిగ తదితరులు పాల్గొన్నారు.

**కనగల్ మండలంలో ఎంపీపీ ప్రచారం**



కనగల్ : ప్రచారంలో పాల్గొన్న ఎంపీపీ కరీంపాషా

కనగల్ : నల్లగొండ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల భూపాల్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ కనగల్ మండలం ఇస్లాంనగర్ గ్రామపంచాయతీ పరిధి కేబీ తండాలో ఎంపీపీ కరీంపాష ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బోయపల్లి జానయ్యగౌడ్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు ఇస్లావత్ హనుమంతు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వాలి

- నకిరేకల్ నియోజకవర్గ అభ్యర్థి చిరుమర్తి లింగయ్య

చిట్యాల: నకిరేకల్ నియోజకవర్గంలో అభివృద్ధి కొనసాగించేందుకు బీఆర్ఎస్ పార్టీకి ప్రజలంతా మద్దతుగా నిలిచి ఈ ఎన్నికల్లో తనను గెలిపించాలని బీఆర్ఎస్ అభ్యర్థి చిరుమర్తి లింగయ్య కోరారు. చిట్యాల మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో శనివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గుత్తా అమిత్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ జడల ఆదిమల్లయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ళ లింగస్వామి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

**బీఆర్ఎస్‌లో చేరిక**

చిట్యాల పట్టణంలోని వివిధ పార్టీలకు చెందిన పలువురు యువకులు చిరుమర్తి లింగయ్య సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బెల్లి నరేష్, ఉయ్యాల వికాస్, నాతి మధు, జాల శ్రీకాంత్, పాలకూరి మధు, సాయి, పిన్నింటి శ్రీనివాస్‌రెడ్డిలతో పాటు మరో వంద మంది బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ జడల ఆదిమలయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ళ లింగస్వామి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మెండె సైదులు, కౌన్సిలర్‌లు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పొన్నం లక్ష్మ య్యగౌడ్ పాల్గొన్నారు.

### రెండు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు ఢీ.. డ్రైవర్‌కు గాయాలు

చిట్యాల: మండలంలోని వెలిమినేడు గ్రామ శివారులో హైదరాబాద్–విజయవాడ హైవేపై శనివారం తెల్లవారుజామున రెండు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు ఢీకొన్నాయి. వివరాలు.. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వేగంగా వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అదుపుతప్పి ముందు వెళ్తున్న మరో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఢీకొట్టిన బస్సులోని డ్రైవర్‌కు గాయాలయ్యాయి. రెండు బస్సుల్లోని ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వెనుక నుంచి ఢీకొట్టిన బస్సు ముందు భాగం ధ్వంసమైంది. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని చిట్యాల పోలీసులు తెలిపారు.

### పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

నార్కట్‌పల్లి : కార్తీక మాసం సందర్భంగా నార్కట్‌పల్లి డిపో నుంచి పంచారామ పుణ్యక్షేత్రాలకు ఈ 26వ తేదీన రాత్రి 8గంటలకు ప్రత్యేక బస్సులు నడిపించనున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటమ్మ తెలిపారు. శనివారం స్థానికంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. పుణ్య క్షేత్రాలకు వెళ్లేందుకు పెద్దలకు రూ.1800, పిల్లలకు రూ.1000 చార్జీ ఉంటుందన్నారు. పూర్తి సమాచారం కోసం డిపో మేనేజర్ సెల్ నంబరు 9959226309ను సంప్రదించాలని కోరారు.

# గడ్డి మందు తాగిన రైతు మృతి



శ్రీనివాస్ (ఫైల్)

కేతేపల్లి: అప్పుల బాధతో గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన రైతు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేతేపల్లి మండలం ఇనుపాముల గ్రామానికి చెందిన పుణ్యమూర్తి శ్రీనివాస్(42) తనకున్న ఐదు ఎకరాల భూమిలో పత్తి, వరి సాగు చేశాడు. ఈ ఏడాది దిగుబడి సరిగా రాకపోవటంతో సాగు పెట్టుబడికి చేసిన అప్పు తీర్చే అవకాశం లేకుండా పోయింది. దీంతో పాటు పెళ్లీడుకు వచ్చిన కూతురు వివాహం ఎలా చేయాలో తెలియక మనస్తాపం చెందిన శ్రీనివాస్ శుక్రవారం ఉదయం గ్రామ శివారులో గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు శ్రీనివాస్‌ను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతున్న శ్రీనివాస్ ఆరోగ్యం విషమించి శనివారం మృతిచెందాడు. మృతుడి భార్య మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని కేతేపల్లి ఎస్‌హెచ్ఓ కె.రాధాకృష్ణ తెలిపారు.

# బీఆర్ఎస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం



ప్రచారం చేస్తున్న కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి సతీమణి అరుణ

చండూరు : బీఆర్ఎస్ పార్టీతో మునుగోడు అభివృద్ధి సాధ్యమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతిరెడ్డి అన్నారు. చండూరు పట్టణానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు శనివారం ఆమె సమక్షంలో ఇడికుడలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోమటిరెడ్డి బ్రదర్స్ ఆగడాలను తట్టుకోలేక తనతో పాటు బీఆర్ఎస్‌లో ఇప్పటికే పలువురు చేరారని తెలిపారు. బీఆర్ఎస్‌లో చేరినవారిలో రాపోలు నారాయణ, కట్ట అంజయ్య, పన్నాల లింగయ్య, బొమ్మరబోయిన వెంకటేశం, రహీంబాబా, రఫి, కల్లెట్ల మారయ్య, గుంటి మధు, ఇడికుడ నరేందర్, ఇరిగి శంకర్, షేక్ చాంద్‌పాష, కర్నాటి శ్రీనివాసులు, నక్కపోతు రాజు, సంతోష్, బొమ్మకంటి శేఖర్, సైదులు తదితరులు ఉన్నారు.

**కూసుకుంట్ల సతీమణి అరుణ ప్రచారం**

చండూరు : మునుగోడు నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ఆయన సతీమణి అరుణ శనివారం చండూరులో ప్రచారం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తోకల చంద్రకళవెంకన్న, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు భూతరాజు దశరథ, కౌన్సిలర్లు కోడి వెంకన్న, అన్నపర్తి శేఖర్, కొన్రెడ్డి యాదయ్య, గుంటి వెంకటేశం, చిలుకూరి రాధిక శ్రీనివాస్, కీర్తిసంజయ్ పాల్గొన్నారు.

# పత్తి తూకంలో అవకతవకలు

- ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు



భీమారంలో విచారణ చేస్తున్న జిల్లా లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు

కేతేపల్లి : రైతుల నుంచి కొనుగోలు చేసిన పత్తిని తూకం వేయడంలో అవకతవకలకు పాల్పడుతూ మోసం చేస్తున్న ముగ్గురు వ్యక్తులపై జిల్లా లీగల్ మెట్రాలజీ(తూనికలు, కొలతలు) అధికారులు కేసు నమోదు చేశారు. ఈ సంఘటన కేతేపల్లి మండలంలోని భీమారం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. మెట్రాలజీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మర్రిగూడెం గ్రామానికి చెందిన చెవుల రాజు, ఖమ్మం జిల్లా మల్లవరం గ్రామానికి చెందిన దుగ్గిదేవర రామాంజనేయులు అనే వ్యాపారులు భీమారం గ్రామంలో అవిరెండ్ల బాలరాజును మధ్యవర్తిగా ఏర్పాటు చేసుకుని రైతుల పండించిన పత్తి కొనుగోలు చేస్తున్నారు. ఈక్రమంలో దాదాపు 50 మంది రైతుల నుంచి 500 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేసి తరలించారు. అయితే పత్తిని తూకం వేసేందుకు ఎలక్ట్రానిక్ కాంటాలకు బదులుగా పాతకాలం భీమ్‌స్కేల్(దండెం కాంటాలు)వినియోగిస్తూ తూకంలో అవకతవకలకు పాల్పడుతూ తమను మోసం చేస్తున్నారని రైతులు గుర్తించారు. తప్పుడు తూకాలపై స్థానిక రైతులు అందించిన సమాచారం మేరకు నకిరేకల్ వ్యవసాయ మార్కెటింగ్ కార్యదర్శి చేసిన ఫిర్యాదు ఆధారంగా జిల్లా మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం గ్రామంలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. పత్తిని తూకం వేసేందుకు వ్యాపారులు నాసిరకమైన తాళ్లు, ఇనుప పళ్లాలతో తయారు చేసిన భీమ్‌స్కేల్‌ను వినియోగిస్తూ తూకంలో రైతులను మోసం చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో వ్యాపారులు రామాంజనేయులు, చెవుల రాజులతో పాటు వారికి సహకరించిన బాలరాజుపై లీగల్ మెట్రాలజీ చట్ట కింద కేసు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు. తూకానికి వినియోగిస్తున్న భీమ్‌స్కేల్ తూకం, నంబరు బాట్లను, కొనుగోలు చేసిన పత్తిని రవాణా చేసేందుకు ఉపయోగిస్తున్న వాహనం ఆర్‌సీ పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. బాధిత రైతులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. తనిఖీల్లో సిబ్బంది అంబేద్కర్, సురేష్ పాల్గొన్నారు.

## మద్యం, నగదు పట్టివేత

కేతేపల్లి: మండలంలోని బండపాలెం వద్ద అక్రమంగా కారులో రవాణా చేస్తున్న మద్యం, బీరు బాటిళ్లను శనివారం జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకుని కేసు నమోదు చేశారు. నల్లగొండలోని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ శంభుప్రసాద్ కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. కేతేపల్లి మండలంలో అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్నారనే సమాచారం మేరకు ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది శనివారం తనిఖీలు నిర్వహించారు. నరేష్ అనే వ్యక్తి టాటాసుమోలో తరలిస్తున్న 20 కాటన్ల మద్యం, 108 బీర్ బాటిళ్లను బండపాలెం వద్ద అధికారులు పట్టుకున్నారు. మద్యం రవాణా చేస్తున్న నరేష్‌పై కేసు నమోదు చేయటంతోపాటు, రవాణాకు వినియోగించిన కారు, రూ.6,21,287 విలువైన మద్యం సీజ్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ తనిఖీల్లో ఏఈఎస్ కిషన్‌నాయక్, సీఐలు రాకేష్, శ్రీనివాస్‌నాయక్, ఎస్ఐ శివకృష్ణ, రాఘవేందర్, సిబ్బంది అయూబ్, శ్రీనివాస్, చందన, ప్రశాంత్ బ్రహ్మం, రమేష్, పాల్గొన్నారు.

**నగదు పట్టివేత**

మర్రిగూడ : సరంపేట క్రాస్‌రోడ్డు వద్ద ఎలాంటి ఆధారాలు లేకుండా నగదు తీసుకెళ్తున్న వారి నుంచి రూ.1.50 లక్షలు పట్టుకుని సీజ్ చేశామని ఎస్ఐ కె.రంగారెడ్డి తెలిపారు. లెంకలపల్లి గ్రామానికి చెందిన నాగరాజు అనే వ్యాపారి అనుమతికి మించి నగదు తీసుకెళ్తుండగా పట్టుకున్నామన్నారు.

# నత్తనడకన రోడ్డు విస్తరణ!

- పనుల్లో నాణ్యతాలోపం !
- పర్యవేక్షణ చేయని అధికారులు
- దుమ్ముతో వాహనదారుల ఇక్కట్లు
- ఆరు నెలలైనా పూర్తి కాని పనులు
- ఇబ్బందులు పడుతున్న నార్కట్‌పల్లి ప్రజలు



బస్టాండ్ ఎదుట రోడ్డుపై నిలిచిన నీరు



బస్సు వెళ్తుండగా ఎగిసిపడుతున్న దుమ్ము

నార్కట్‌పల్లి : మండల కేంద్రంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. నార్కట్‌పల్లి పట్టణంలో మూడు కిలోమీటర్ల రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడానికి స్థానిక ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య చొరవ తీసుకొని రూ.16 కోట్లు మంజూరు చేయించారు. ఈ ఏడాది ఏప్రిల్ 20వ తేదీన రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పనులకు శంకుస్థాపన చేశారు. మే 28వ తేదీన కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. అయితే ప్రణాళిక లేకుండా పనులు చేస్తుండడంతో రోడ్డు పూర్తిగా మురికి నీటితో నిండి గుంతలు ఏర్పడడంతోపాటు, దుమ్ము లేస్తుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు విస్తరణ పనుల్లో ఏమాత్రం నిబంధనలు పాటించకుండా కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా చేస్తున్నా సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎలాంటి ప్రణాళిక లేకుండా పాత రోడ్డును తవ్వి సుమారు ఆరు నెలల పైనే అయినా ఇప్పటివరకు రోడ్డు విస్తరణ పనులు పూర్తికాలేదు.

**వ్యాపారుల ఆందోళన**

డస్ట్, కంకర వేసి రోడ్డుపై రోలింగ్ చేయకపోవడం, వాటర్ క్యూరింగ్ చేయకుండా వదిలేయడంతో దుమ్ము లేచి రోడ్డు వెంబడి ఉన్న వ్యాపారస్తులు శ్వాసకోశ వ్యాధులతో ఆస్పత్రుల పాలవుతున్నారు. ప్రజలు రోడ్డుపై తిరగలేకపోతున్నారు.

**ప్రణాళిక లేకుండా పనులు**

రోడ్డు విస్తరణలో అధికారులు, కాంట్రాక్టర్ ప్రణాళిక లేకుండా పనిచేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. రోడ్డు మధ్య నుంచి ఇరువైపులా 50 ఫీట్ల వెడల్పుతో పనులు చేపట్టాల్సి ఉంది. అయితే రెండువైపులా పనులు ఒకేసారి చేయడంతోపాటు తొందరగా పనులు పూర్తి చేయాలనే ఆత్రుతలో నాసిరకంగా పనులు చేస్తున్నారు. మొదటగా ఒకవైపు మాత్రమే పాత రోడ్డు తొలగించి పనులు పూర్తయిన అనంతరం మరోవైపు పనులు చేయాలి. కానీ నార్కట్‌పల్లి పట్టణంలో చేపడుతున్న పనులు అందుకు విరుద్ధంగా జరుగుతున్నాయి. రోడ్డు మొత్తం ఒకేసారి తవ్వి విస్తరణ పనులు చేస్తున్నారు. నాసిరకం మెటీరియల్ ఉపయోగించినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో కాంట్రాక్టర్‌తో అధికారులు కుమ్మక్కయ్యారని ప్రజలు గుసగుసలాడుతున్నారు. ఎన్నికల సమయం కావడంతో ప్రజాప్రతినిధులు పట్టించుకోక పనుల నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది. ఈ విషయమై సంబంధిత అధికారికి ఫోన్ చేసినప్పటికీ లిఫ్ట్ చేయడం లేదు.

### వాటర్ క్యూరింగ్ చేయడం లేదు



రోడ్డు పనులు సగం వరకు చేసిన అనంతరం డ్రైనేజీ పనులు చేయడంతో ఇళ్లలోని మురుగు రోడ్డుపై ప్రవహిస్తోంది. రోడ్డుపై ప్రజలు నడిచే పరిస్థితి లేకుండా పోయింది. వాహనదారులు మురికి నీటిలోనుంచి వెళ్లాల్సి వస్తోంది. ప్రణాళిక లేకుండా పనులు చేస్తున్నారు. వాటర్ క్యూరింగ్ చేయడం లేదు.

– వీసం బాలరాజు, నార్కట్‌పల్లి

### దుమ్ముతో ఇబ్బంది పడుతున్నాం



రోడ్డుపై డస్ట్, కంకర పోసి రోలింగ్ చేయకపోవడం, నీరు పోయకపోవడంతో దుమ్ము లేచి ఇబ్బందులు పడుతున్నాం, దుమ్ము ఇళ్లలోకి వస్తోంది. సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేయాలి. పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా పనులు చేస్తున్నారు.

– బొక్క భూపాల్‌రెడ్డి, నార్కట్‌పల్లి